
సాక్షి బాపట్ల
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6213 టీఎంసీలు. ఎగువ నుంచి 13,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1198 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు యథావిధిగా పాఠశాలలు

గుంటూరు డీఈవో పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు శనివారం యథావిధిగా పనిచేస్తాయని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. గత నెలలో సంక్రాంతి సెలవుల్లో నష్టపోయిన పనిదినాన్ని భర్తీ చేయడంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 11న అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల పరిధిలో విద్యార్థులకు తరగతులు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు జరిగే విధంగా చూడాలని ఉపవిద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, హెచ్‌ఎంలను ఆదేశించారు.

14న పీఎఫ్ పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యనిధి పెన్షనర్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 14వ తేదీ గుంటూరులోని కృష్ణనగర్‌లో ఉన్న ఈపీఎఫ్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్లు తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు, సమస్యలను తెలియజేసేందుకు వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో 9494657469 వాట్సాప్ నంబరుతో పాటు 0863–2344106, 2232921 నంబర్లను ఉపయోగించుకోవచ్చని సూచించారు. so.guntur@epfindia.gov.in మెయిల్‌కు పంపాలని తెలిపారు. వెబ్‌ఎక్స్ ఐడీ 26447532521కు పాస్‌వర్డ్ epgo*123 ద్వారా సైతం లాగిన్ కావచ్చని పేర్కొన్నారు.

జిల్లా జైలును పరిశీలించిన గుంటూరు ఎస్పీ



పట్నంబజారు(గుంటూరు): గుంటూరు జిల్లా జైలును శుక్రవారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. జైలు ప్రాంగణమంతా పరిశీలించి కారాగార భద్రతకు సంబంధించి అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖరరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆర్.వీరేంద్రప్రసాద్, జైలర్ సీహెచ్ కిరణ్, డెప్యూటీ జైలర్ వెంకటరత్నం, అరండల్‌పేట సీఐ రామానాయక్ తదితరులు ఉన్నారు.

ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా స్థాయి (డీఎల్‌టీసీ, ఐటీఐ) శిక్షణాధికారి ఎస్.మధుసూదనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఎల్‌టీసీ, ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా ఆయా కోర్సుల్లో నిరుద్యోగ యువతకు రెండు నెలలు పాటు శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్‌ఎస్‌డీసీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఈనెల 16లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆర్‌పీ మణిదీప్‌ను 80746 07278 నంబర్లో సంప్రదించాలన్నారు.

యార్డులో 1,13,546 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,02,730 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,13,546 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,485 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఇంటింటికీ జలం

- జలజీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు
- ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు
- రెండు విడతల్లో రూ.587.55 కోట్లతో పనులు
- రూ.205.21 కోట్లతో మొదటి దశ పనులు
- ఇప్పటికే 196 పనులు పూర్తి
- మిగిలిన పనుల పూర్తికి అధికారుల కసరత్తు
- రెండో విడతలో రూ.382.34 కోట్లతో పనులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీరు అందివ్వడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందుకోసం అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తోంది. జలజీవన్ మిషన్ పథకం ద్వారా సదరు పనులను చేపట్టారు. ఈ పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షిస్తోంది.

మొదటి దశలో..

మొదటి దశలో జిల్లాలోని బాపట్ల, అద్దంకి, చీరాల, పర్చూరు, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో 723 పనులు మంజూరు చేశారు. ఈ పనుల కోసం రూ.205.21 కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు.

రెండవ దశలో..

జిల్లా వ్యాప్తంగా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రూ.382.34 కోట్లతో 679 పనులు మంజూరు చేశారు. ఈ పనులు ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి.



జిల్లా గ్రామీణ నీటిపారుదల శాఖ కార్యాలయం

మొదటి దశ పనులు

నియోజకవర్గం	మంజూరైన పనులు	పూర్తి చేసినవి	జరుగుచున్నవి
బాపట్ల	88	28	01
అద్దంకి	88	08	09
చీరాల	72	05	07
పర్చూరు	142	23	30
రేపల్లె	226	95	217
వేమూరు	107	37	00
మొత్తం	723	196	68

మిగిలిన 459 పనులు టెండర్ల దశలో ఉన్నాయి.

రెండవ దశ పనులు

నియోజకవర్గం	మంజూరైన పనులు	కేటాయించిన నిధులు
అద్దంకి	129	73.21 కోట్లు
బాపట్ల	76	24.25
చీరాల	64	23.35
పర్చూరు	125	117.79
రేపల్లె	251	122.70
వేమూరు	52	21.02

పనుల పురోగతి

జలజీవన్ మిషన్ మొదటి దశలో రూ.205.21 కోట్లతో 723 పనులు చేపట్టారు. ఇప్పటి వరకు 196 పనులు పూర్తి కాగా 68 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన 459 పనులు టెండర్ల దశలో ఉన్నాయి.

చేపట్టిన పనులు

గ్రామాల్లో ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న బోరుబావులు, పైపు లైన్ల ద్వారా ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం బోర్లు, పైపులైన్లు అందుబాటులో లేని గ్రామాల్లో కొత్తగా బోర్లు తవ్వి పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందించనున్నారు. ఈ తరహాలో జిల్లాలోని అన్ని గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

జలజీవన్ మిషన్ ద్వారా అందరికి తాగునీరు



జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రెండు దశల్లో రూ.587.55 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి నీటిని అందించనున్నాం. మొదటి దశ పనులు వేగంగా సాగుతున్నాయి. రెండవ దశ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పనులు జరుగుతున్నాయి.

– విద్యాసాగర్, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్



రేపల్లె నియోజకవర్గం అంబేద్కర్ కాలనీలో కుళాయి నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళ

గుంటూరు డీఎంహెచ్‌ఓగా డాక్టర్ శ్రావణ్‌బాబు



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ శ్రావణ్‌బాబును నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ సుమయఖాన్‌పై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి జనవరి 9న ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జె.హనుమంతరావుకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు శుక్రవారం డాక్టర్ హనుమంతరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు ప్రస్తుతం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రేపల్లె సమీపంలోని బెల్లం వారిపాలేనికి చెందిన డాక్టర్ శ్రావణ్‌బాబు గుంటూరు వైద్య కళాశాలలో 1988లో ఎంబీబీఎస్, విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో 2011లో పీజీ డీపీహెచ్ చేశారు. గుంటూరు జిల్లా అప్పికట్లలో 1998లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరి ప్రభుత్వ సర్వీసులో ప్రవేశించారు. బాపట్ల పీపీ యూనిట్, పొన్నూరు, పాదిలిలో పలు హోదాల్లో పనిచేశారు. చీరాల ఏరియా ఆసుపత్రిలో పిల్లల వైద్యనిపుణులుగా పనిచేశారు. డీఎంహెచ్‌ఓగా విధుల్లో చేరిన డాక్టర్ శ్రావణ్‌బాబును వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జె.హనుమంతరావు, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

మార్చి 13న శాసన మండలి ఎన్నికలు

- అమలులోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల అర్బన్: శాసన మండలి ఎన్నికల ప్రకటనతో బాపట్ల జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. శాసన మండలి ఎన్నికల ప్రకటనతో జిల్లా, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు మార్చి 13వ తేదీ బాపట్ల జిల్లాలో జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి అధికారులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 16వ తేదీ నామినేషన్ల ప్రక్రియకు ప్రకటన విడుదల చేయాల్సి ఉందన్నారు. 23వ తేదీతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుందని తెలిపారు. 24న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 27న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. మార్చి 13న ఎన్నికలు జరుగుతాయని వివరించారు. బాపట్ల జిల్లా పరిధిలోని 13 మండలాల్లో శాసనమండలి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. 17,626 మంది పురుష గ్రాడ్యుయేట్ ఓట్లు ఉండగా, 8,745 మంది మహిళా గ్రాడ్యుయేట్ ఓట్లు, ఇతర క్యాటగిరీలో ఒకరు ఉన్నారని చెప్పారు. మొత్తంగా బాపట్ల జిల్లాలో 26,372 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. గ్రాడ్యుయేట్స్ నియోజవర్గం పరిధిలో 24 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలో 13 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో 1,400లోపు మాత్రమే ఓటర్లు ఉండాలన్నారు. ఆ సంఖ్యకు మించితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాసన మండలి ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు 16 కిలోమీటర్లలోనే ఓటు వేయాలనే నిబంధనను విస్మరించరాదన్నారు. పోలింగ్ కేంద్రాలను అధికారులు యుద్ధప్రాతిపదికన తనిఖీ చేసి సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలన్నారు. పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా ర్యాంప్ ఉండాలని, కేంద్రానికి తలుపులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించి కలెక్టరేట్‌కు నివేదించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. నకిలీ ఓటర్ల తొలగింపుపై ఓటర్ల జాబితాను పునఃపరిశీలించాలని చెప్పారు. ఓటర్ల ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి అధికారులు పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నియామకానికి గజిటెడ్ అధికారులు వివరాలను తెప్పించుకోవాలని డీఆర్వోను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ బూత్‌ల నిర్వహణపై అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల పరిశీలకులను నియమించి ప్రత్యేక శిక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఏఎస్పీ పి.మహేష్, డీఆర్‌ఓ కె.లక్ష్మీశివజ్యోతి, బాపట్ల, చీరాల ఆర్‌డీఓలు జి.రవీందర్, పి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

శ్రీశైల మల్లన్నకు చీరాల తలపాగా





మల్లన్నకు పాగా నేస్తున్న పృథ్వీ వెంకటేశ్వర్లు, అలంకరించేందుకు సిద్ధం చేసిన తలపాగా

మల్లన్న పెళ్లికి వేళాయె

- చీరాలలోని పృథ్వీ వంశస్తులకు నేసే భాగ్యం
- మూడు తరాలుగా కొనసాగుతున్న ఆచారం

చీరాల: శ్రీశైలం మల్లన్న పెళ్లికి తలపాగా సిద్ధమైంది. పరమ శివుడిని పెళ్లి కొడుకుగా చేసేది మనవారే. శివరాత్రి రోజున చీరాల నేతన్న నేసిన తలపాగాను చుట్టిన తర్వాతే ఆయన పెళ్లి తంతు మొదలవుతుంది. ఈ అదృష్టం చీరాల చేనేత కార్మికుడికి దక్కడం ఈ ప్రాంతవాసులు అదృష్టంగా భావిస్తారు. మూడు తరాలుగా ఈ ఆచారం కొనసాగుతూ వస్తోంది. ప్రతి ఏటా శివరాత్రి నాడు శ్రీశైలం మల్లన్న కల్యాణం నిర్వహిస్తారు. ఆయనను వరుడిగా తీర్చిదిద్దేందుకు పాగాలంకరణ చేస్తారు. శివరాత్రి లింగోద్భవ సమయంలో 10 నుంచి 12 గంటల మధ్య మల్లికార్జునస్వామి కల్యాణం చేసేందుకుగాను చీరాలలో తయారు చేసిన చేనేత వస్త్రంతో పెళ్లి కుమారుడిగా అలంకరణ చేస్తారు. 150 గజాలు ఉండే ఈ వస్త్రాన్ని ఆలయ శిఖరం నుంచి నవనందులను కలుపుతూ చుడతారు. (ఈ సమయంలో వస్త్రాన్ని చుట్టే భక్తులు ఒంటిపై నూలుపోగు లేకుండా ఉండాలన్నది ఆచారం). కల్యాణం అనంతరం ఎంతో విశిష్టత కలిగిన ఈ వస్త్రాన్ని దక్కించుకొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు సైతం పోటీపడి కొనుగోలు చేస్తారు.

పృథ్వీ వంశస్తుల అదృష్టం..

మల్లన్నను పెళ్లి కుమారుడిగా అలంకరించే వస్త్రాన్ని నేసే మహద్భాగ్యం చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీలోని హస్తినాపురంలోని చేనేత కుటుంబానికి చెందిన 'పృథ్వీ'వంశానికి దక్కింది. పృథ్వీ వంశం మూడు తరాలుగా (వందేళ్లకు పైగా) ఈ ఆచారం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పృథ్వీ వెంకటేశ్వర్లు నలభై ఏళ్లుగా మల్లన్న వస్త్రాన్ని నేస్తూ ప్రతి శివరాత్రి రోజున శ్రీశైలం వెళ్లి మల్లన్నకు అలంకరిస్తారు. మల్లికార్జునస్వామిని తాను నేసిన బట్టతో వరుడిగా అలంకరించడం తన పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

365 రోజుల పాటు నేత..

మల్లన్నను పెళ్లి కుమారుడిగా అలంకరించే ఈ వస్త్రాన్ని తయారు చేయాలంటే 365 రోజుల పాటు పని చేయాలి. రోజుకు ఒక మూర (అడుగున్నర) చొప్పున 365 రోజులు ఉపవాసం, నియమనిష్ఠలతో నేస్తారు. ఇందులో ఆయన కుటుంబ సభ్యులు పాలుపంచుకుంటారు. ఈ జగత్తును ఏలే శివపరమాత్ములు లోక కల్యాణం కోసం జరిగే మహాశివరాత్రి రోజున ఆయనను పెళ్లి కుమారుడిగా అలంకరించేందుకు వినియోగించే తలపాగాను చీరాల ప్రాంతంలో నేయటం ఈ ప్రాంత వాసులు తమ అదృష్టంగా భావిస్తారు. ఇటువంటి అవకాశం చీరాల హస్తినాపురం ప్రాంతానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు వంశానికి దక్కడం గొప్ప విషయంగా ఈ ప్రాంత వాసులు భావిస్తున్నారు. తలపాగాను తీసుకొని పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం ఊరేగింపుగా శ్రీశైలం బయల్దేరుతుంది. పది రోజుల పాటు అక్కడే ఉండి లింగోద్భవ సమయంలో రాత్రి 11 గంటల సమయంలో ఒంటిపై నూలుపోగు లేకుండా గర్భగుడి నుంచి నవనందులను కలుపుతూ శిఖరం చుట్టూ ఈ పాగాతో చుడతారు. ఆ తర్వాతే శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి.

మహిళా హక్కులే మానవ హక్కులు

సంఘటితంగా పోరాడాలి

- ఒంటరిగా ఏమీ సాధించలేం
- ముఖాముఖిలో ప్రముఖ రచయిత్రి ఓల్గా
- సాహితీ సుగంధాలు వెదజల్లుతున్న పుస్తక మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు సహకార దృక్పథంలో ఉన్నప్పుడే వారి విముక్తి సాధ్యమవుతుందని ప్రఖ్యాత స్త్రీ వాద రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై ఓల్గాతో ముఖాముఖి కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలను సంఘటితం చేసే సంఘాలు లేవన్నారు.

చైతన్యం కలిగించే ప్రయత్నం..

'మహిళా హక్కులే మానవ హక్కులు' అనే నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశానన్నారు. నిస్సహాయస్థితిలో, అభద్రతతో ఉన్న మహిళలకు అండగా సాహిత్యం ద్వారా వారికి ఆలోచనలను కల్పించటానికి వారు ఉద్యమ బాటలో నడిచేందుకు తాను కృషి చేశానని ఓల్గా అన్నారు. అస్మిత సంస్థ ద్వారా 'మహిళావరణం' రచనను తీసుకొచ్చానన్నారు. అందులో చరిత్రలో విస్మరణకు గురైన మహిళలను గుర్తించి అందులో చూపించానన్నారు. దానికి చాలా పరిశోధన చేసినట్లు చెప్పారు. అదే విధంగా సంప్రదాయ సంగీతం, నాట్యం, సాహిత్యాలతో అభ్యుదయ భావాలను తెలియజేసేందుకు కృషి చేశానని అందులో భాగంగానే 'యుద్ధ–శాంతి' నృత్య రూపాకాన్ని రచించి విజయం సాధించానన్నారు. అంతేకాకుండా లక్ష్మణరేఖ రచన ద్వారా గృహహింసను ఎదుర్కొన్న మహిళా పాత్రలను వివరించానన్నారు. అదేవిధంగా విముక్త కథల ద్వారా రామాయణంలోని పాత్రల ద్వారా చాలా అంశాలను వివరించానన్నారు. ఎవరి మనోభావాలను దెబ్బతియకుండా ఇతర భావజాలం ఉన్న వ్యక్తులను సైతం ఆలోచింపజేసే విధంగా తాను ముందుకు సాగానని, అందులో విజయం సాధించానని వివరించారు. లిబరలైజేషన్ ఆఫ్ సీతా పేరుతో పలు బాషల్లోకి అనువధింపబడి తనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు. సాహితీవేత్తలు బండ్ల మాధవరావు, వరప్రసాద్‌లు సంధానకర్తలుగా వ్యవహరించారు.



పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద పుస్తకాలు చూస్తున్న యువత

సామాజిక ఇతివృత్తాల ఆధారంగా చలనచిత్రాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రఖ్యాత సినీ దర్శకుడు సత్యజిత్ రే సామాజిక ఇతివృత్తాలనే చలనచిత్రాలుగా తీసుకొచ్చారని ప్రముఖ సినీ దర్శకుడు అక్కినేని కుటుంబరావు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో సత్యజిత్ రే ప్రతిభా వేదికపై 'సత్యజిత్ రాయ్–జీవితం–సినిమా' అంశంపై చర్చా కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ బైస్కిల్‌థీవ్స్ చిత్రం సత్యజిత్ రేపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిందన్నారు. ఆయన తీసిన 'పథేర్ పాంచాలి' చిత్రం యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను తీసుకొచ్చిందన్నారు. 1935 నుంచి 1971 వరకూ సుమారు 36 చిత్రాలు తీసిన సత్యజిత్ రాయ్ చిత్రరంగానికి సుసంపన్నం చేశారన్నారు. ఆయనకు ఆస్కార్‌తో పాటు భారతరత్న వంటి పురస్కారాలు వరించాయన్నారు కార్యక్రమాన్ని సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు నిర్వహించారు.

నిషేధిత వలలు వినియోగించవద్దు

మత్స్య శాఖ జేడీ సురేష్

చీరాల టౌన్: మత్స్యకార గ్రామాల్లో నివశించే ప్రజలందరూ అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉండాలి.. గొడవలకు కారణమయ్యే నిషేధిత వలల వినియోగాన్ని ఆపేయాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.సురేష్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో వాడరేవు, రామాపురం, కఠారిపాలెం గ్రామ మత్స్యకార పెద్దలతో మత్స్య శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖ, మెరైన్ అధికారులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేడీ మాట్లాడుతూ గతంలో వల, వేట వివాదంపై తీవ్ర ఘర్షణలు జరిగాయని, అవి పునరావృతం కాకుండా ప్రభుత్వం, మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో ఘర్షణలకు కారణమైన వలలను పూర్తిగా నిషేధించామన్నారు. గంగమ్మ తల్లిని నమ్ముకుని జీవనం సాగించే మత్స్యకారులు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని గొడవలు పడకూడదన్నారు. వాడరేవు మత్స్యకార పెద్దలు ఎరిపిల్లి రమణ, ఐఆర్‌జీ వెంకటేశ్వర్లు, మచ్చా సువార్తరావు, ఓ.సూరిబాబు, అక్కల శ్రీనివాసరెడ్డి, పి.నారాయణ మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లో వివాదాలు, ఘర్షణలకు చెప్పుడు మాటలే కారణమని పేర్కొన్నారు. గతంలో వాడరేవు మత్స్యకారులపై జరిగిన దాడులు భవిష్యత్తులో జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిషేధిత వలలను ఎవ్వరూ వినియోగించకూడదని, ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని జేడీ హెచ్చరించారు. అనంతరం చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు మత్స్యకార పెద్దలకు పలు సూచనలు అందించారు. సమావేశంలో మత్స్యశాఖ ఏడీ కృష్ణకిషోర్, ఎంపీడీవో నేతాజీ, మెరైన్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ మల్లికార్జున, ఎస్‌ఐలు సురేష్, జనార్దన్, ఎఫ్‌డీవో రాజ్‌కుమార్, వాడరేవు, రామాపురం, కఠారిపాలెం మత్స్యకార పెద్దలు పాల్గొన్నారు.



మత్స్యకార పెద్దలకు సూచనలందిస్తున్న జేడీ సురేష్, డీఎస్పీ శ్రీకాంత్

వైద్య, ఆరోగ్య సేవలు అందరికీ అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి రోహిణి

చినగంజాం: ప్రభుత్వం అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను గ్రామాల్లో ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజర్లు బీ రోహిణి, సీహెచ్ ప్రేమ పావని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ప్రతి శుక్రవారం వివిధ శాఖలతో జరుగుతున్న సమన్వయ సేవలను వారిరువురు సమీక్షించారు. 0-5 ఏళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలు, బాలికల్లో సంభవిస్తున్న రక్త హీనత, పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారిని బయట పడవేయటంతో అంగన్‌వాడీ, ఆరోగ్య మిత్ర, ఆశ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. బీ రోహిణి మాట్లాడుతూ గ్రామంలో ఏ ఒక్కరూ పోషకాహార లోపానికి గురికాకుండా చూసుకోవాలని, సకాలంలో వారికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాల కల్పనలో అలసత్వం చూపకూడదని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి విజయ భాస్కర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.హరిప్రసాద్, సూపర్ వైజర్ పీవీ సుబ్బారావు, రాజకుమారి పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థపై సమగ్ర నివేదిక అందించాలి

జేసీ రాజకుమారి


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: ఆహార ధాన్యాలు, గ్యాస్, పెట్రోలు, నిత్యావసర సరుకులు తదితర అంశాలపై అధికారులు ప్రతినెలా తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ దుకాణాలు, పెట్రోలు బంకులు, రైస్ మిల్లులను నిర్దిష్ట విధానాలకు అనుగుణంగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా అంగన్‌వాడీలు, ప్రభుత్వ వసతి గృహాల్లో పిల్లలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలని, నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసే విధానంలో అంగన్‌వాడీలకు అవగాహన కల్పించాలని సూచించారు. కొన్నిచోట్ల అక్రమ వ్యాపారం, ప్రజలతో వ్యవహరించే తీరు ఇబ్బందికరంగా ఉంటోందని ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిని ఉపేక్షించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు పంపిణీ అయ్యే బియ్యం, కందిపప్పు సరిపడా నిల్వ ఉంచేటట్లు చేయాలని ఆదేశించారు. ప్రతినెలా రెండో శుక్రవారం నిర్వహించే సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఓ ఎస్.పద్మశ్రీ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు, అధికారులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాది తోఫాలో పాల్గొన్న నూతన వధూవరులను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తన చాంబర్‌లో ఆశీర్వదించారు. దాంపత్య జీవితాన్ని సుఖసంతోషాలతో ఆదర్శంగా కొనసాగాలని సూచించారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము


సమావేశంలో మాట్లాడుతున్న లాలుపురం రాము, వేదికపై యార్లగడ్డ భాగ్యలక్ష్మి

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్ని బలోపేతం చేయాలని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము సూచించారు. స్థానిక కన్నావారితోటలో శుక్రవారం గుంటూరు కో–పరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీడీసీఎంఎస్) జిల్లా మహాజన సభ సమావేశం నిర్వహించారు. ముందుగా జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి 2023–24 ఆదాయం, వ్యయానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. దాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాము మాట్లాడుతూ పీఏసీఎస్ అధ్యక్షులు ఆయా ప్రాంతాల్లో అనుకూలమైన వ్యాపారాలు చేసి పీఏసీఎస్‌లను లాభాల బాటలోకి తీసుకురావాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 పీఏసీఎస్‌లు ఉండగా, అందులో 62 నష్టాల్లో ఉన్నాయని తెలిపారు. సంఘాలు ఏ వ్యాపారం చేయాలన్న పెట్టుబడి పెట్టడానికి జీడీసీసీబీ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. సొసైటీల్ని బలోపేతం చేయడానికి రోజుకు కనీసం ఒక గంట కేటాయించాలని సూచించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో సిబ్బంది సహకరించడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాము మాట్లాడుతూ సహకరించని సిబ్బందికి వేతనాలు నిలిపి వేయాలని ఆదేశించారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 పీఏసీఎస్‌లు, మరో తొమ్మిది ఇతర సహకార సంఘాలు సభ్యులుగా ఉన్నాయని తెలిపారు. ఈ సంఘంలోని సభ్యుల షేరు ధనం రూ.16.77 లక్షలు కలిగి ఉందన్నారు. 2022–23లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 44 జీడీసీఎంఎస్ బ్రాంచీలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయడంతో పాటు లేపాక్షి నోటు పుస్తకాలు, స్టేషనరీ తదితరలకు సంబంధించి రూ.61.95 కోట్ల వ్యాపారం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.97.90 కోట్ల విలువైన 47,824.04 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్‌ను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జీడీసీఎంఎస్ వ్యాపార కార్యకలాపాలు, అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు ఎం.కృష్ణారెడ్డి, డి.రాజు, కె.హరిబాబు, ఎస్.రామయ్య, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పీఏసీఎస్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

చీరాల రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీపీఎఫ్ పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్సిల్ కార్యాలయంలోని ప్రతి పార్సిల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ సీఐ వై.రామారావు మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని రైల్వే స్టేషన్లల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైళ్లలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారం ఉందని, అనుమానం ఉన్న ప్రతి పార్సిల్ సక్రమంగా చెక్ చేయాలని పార్సిల్ సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను రైళ్లలో అక్రమ రవాణా నియంత్రించేందుకు గట్టి నిఘా ఉంచినట్లు చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాల వంటి వాటిపై ఏదైనా సమాచారం ఉంటే జీఆర్పీ సీఐ సెల్ 94409 004870, జీఆర్పీ ఎస్ఐ 94406 27646, అలానే డయల్ 100, హెల్ప్‌లైన్ నెంబర్ 139 సంప్రదించాలని ఆయన తెలిపారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా ద్వారక


మెడల్, ప్రశంస పత్రం అందుకుంటున్న ద్వారక

చీరాల రూరల్: చీరాలకు చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాతుపాటి ద్వారక చాంపియన్‌గా నిలిచింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ పవర్ లిఫ్టింగ్ మెన్స్, ఉమెన్స్ చాంపియన్ షిప్ 2022–23 పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచింది. గుంటూరులోని ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో పోటీలు నిర్వహించారు. చీరాలకు చెందిన భారతీ డిగ్రీ కాలేజీలో చదువుతున్న సాతుపాటి ద్వారక 76 కిలోల విభాగంలో స్నాచ్ 220 కేజీలు, బెంచ్ 100 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 210 కేజీలు మొత్తం 540 బరువు ఎత్తి స్ట్రాంగ్ ఉమెన్‌గా నిలిచి బంగారు పతకం సాధించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ద్వారకను మార్చి 9న హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్స్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేశారు. దీంతో క్రీడాకారిణి ద్వారకను పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

శ్రీరామ దర్శనార్థం అయోధ్యకు పాదయాత్ర



వేటపాలెం: అయోధ్య శ్రీరాముడిని దర్శించుకునేందుకు వేటపాలేనికి చెందిన కొటిక రమేష్ శుక్రవారం పాదయాత్రగా బయలుదేరాడు. స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి కాలినడకను ప్రారంభించారు. రమేష్ మాట్లాడుతూ ఇప్పటికి 20 సార్లు వివిధ రూపాల్లో వెళ్లి దర్శించుకున్నాని చెప్పారు. ఇప్పుడు 21వ సారి పాదయాత్ర రూపంలో వెళ్లి రాముడిని దర్శించుకుంటానని తెలిపారు. పాదయాత్ర హిందూ ధర్మప్రచారం నిమిత్తం చేపడుతున్నట్లు చెప్పారు. నెల రోజుల పాటు యాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు. మార్గమధ్యంలోని భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటానని పేర్కొన్నారు.

అదృశ్యంపై కేసు

చీరాల: ఇద్దరు వివాహితలు అదృశ్యంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. చీరాలలోని చీరాల టూటౌన్, ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు అయ్యాయి. చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరమ్మ ఈనెల 7న చీరాలలో బ్యాంకులో డ్వాక్రా డబ్బులు చెల్లించి వస్తానంటూ వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అలానే చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేరాలకు చెందిన నాగశ్రీలత బుధవారం సాయంత్రం చీరాలలోని సోదరి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని సీఐ సోమశేఖర్ తెలిపారు.

మూడు దశల్లో ఏపీ ఎస్ఆర్ఎం బీటెక్ ప్రవేశ పరీక్షలు

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 2023 విద్యా సంవత్సరం బీటెక్ అడ్మిషన్లకు రంగం సిద్ధమైంది. మూడు దశల్లో ప్రవేశ పరీక్షల్ని నిర్వహించనున్నామని అడ్మిషన్స్ డైరెక్టర్ యలంపల్లి శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి దశ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 21, 22, 23 తేదీలు, జూన్ 10, 11 తేదీల్లో రెండో దశ, జులై 22, 23 తేదీల్లో మూడో దశ పరీక్షల్ని నిర్వహించనున్నామని తెలిపారు. మొదటి దశ ఎంట్రన్స్‌కు విద్యార్థులు ఏప్రిల్ 16వ తేదీలోగా, సెకండ్ ఫేజ్‌లో హాజరయ్యేవారు జూన్ 5, థర్డ్ ఫేజ్‌లో వారు జులై 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్ క్లాస్‌లో 60 శాతం మార్కులు, ఇంటర్మీడియెట్ మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఏపీ ఎస్ఆర్ఎం బీటెక్‌లో చేరేందుకు అర్హులని వివరించారు. అడ్మిషన్లు కోసం ఎస్ఆర్ఎం వెబ్‌సైట్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఎస్ఆర్ఎంఏపీ.ఈడీయూ.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని ప్రొఫెసర్ శివశంకర్ తెలిపారు.

కోటయ్య స్వామికి రూ.34.51 లక్షలు ఆదాయం

గతేడాది కంటే రూ.4.60 లక్షలు అధికం


దేవస్థానంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండలో స్వయంభువుగా వెలిసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారము హుండీలు లెక్కింపు నిర్వహించారు. గతేడాది నవంబరు 24వ తేదీ నుంచి గురువారం వరకు 78 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.34,51,255లు, అన్నదానం హుండీ ద్వారా రూ.1,77,447 వెరసి మొత్తం రూ.36,28,702 కానుకలు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. గత సంవత్సర ఆదాయంతో పోల్చగా ప్రస్తుతము రూ.4,60,857లు అదనంగా వచ్చిందన్నారు. దీంతో పాటు 44.700 గ్రాముల బంగారం, 307 గ్రాములు వెండి ఆభరణములు వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆధ్వర్యంలో ఇస్సపాలెం శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి.సుధాకరరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేశారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు ముక్కు వెంకటేశ్వర రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ మట్లా లింగారెడ్డి, వంగ శ్రీనివాస రెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త వారి ఏజెంట్ బాలాజీ సింగ్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, యల్లమంద బ్రాంచ్ మేనేజరు ఏ.యస్.ఎన్.రసూల్, బ్యాంక్ సిబ్బంది, కోటప్పకొండ ఔట్ పోస్ట్ యస్.ఐ. పి.మాచెర్ల, సూపరింటెండెంట్ నాగిరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీ భ్రమరాంబికా సేవా సమితి, శ్రీ సద్గురు సేవా సమితి సేవక బృందాలు పాల్గొన్నారు. హుండీల లెక్కింపు అనంతరము సదరు లెక్కింపు మొత్తాలను శ్రీ స్వామివారి ఎదుట కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి అర్చక స్వాముల సమక్షంలో చదివి వినిపించారు.

కనీస అవసరంగా వైద్యం

- ఆరోగ్య బీమా అందరికీ వర్తింపజేసేందుకు ప్రభుత్వాలు కృషి
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య రామ్మోహనరావు
- ఏంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు


ప్రసంగిస్తున్న ఆచార్య కె రామ్మోహనరావు

ఏఎన్‌యూ: ప్రస్తుత సమాజంలో వైద్యం మనిషి కనీస అవసరంగా మారిందని రాష్ట్ర ఉన్నత విద్యమండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'భారత దేశంలో ఆరోగ్య బీమా ఆవశ్యకత' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య రామ్మోహనరావు ప్రసంగిస్తూ దేశంలో 70 శాతం ప్రజానీకం ఏదో ఒక రూపంలో ఆరోగ్య బీమా పరిధిలో ఉన్నారన్నారు. మిగతా వారిని కూడా ఆరోగ్య బీమా పరిధిలోనికి తెచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. బీమా రంగంలో అత్యధిక మోసాలు ఆరోగ్యబీమా విభాగంలోనే చోటు చేసుకోవడం దురదృష్టకరమని చెప్పారు.

వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ బీమాతో ప్రజారోగ్యం భద్రంగా ఉండాలని, ప్రజారోగ్యం ప్రాథమిక బాధ్యతలో ఒకటన్నారు. ప్రజారోగ్యానికి ఉపయోగపడే మరిన్ని ఆరోగ్య బీమా పథకాలు అందుబాటులోకి రావల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆరోగ్య శ్రేయస్సుకు కృషి చేయడమే ప్రజా శ్రేయస్సని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధ్యాపకులు ఆచార్య డి. రాజ్ మోహన్ ప్రసంగిస్తూ ఆరోగ్య బీమా వైద్యరంగంలో ఓ కీలక అంశమన్నారు. రాబోయే రోజులలో ఆరోగ్య బీమా రంగ పరిధి విస్తృతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. హైదరాబాద్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ జనరల్ మేనేజర్ మహ్మద్ సాజిద్ కీలకోపన్యాసం చేస్తూ కోవిడ్–19 సమయంలో పలు ఆరోగ్య బీమా సంస్థలు రూ. 800 కోట్లకుపైగా పాలసీ దారులకు చెల్లించాయన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ వి.తులసీదాస్ సదస్సులో చర్చిస్తున్న అంశాలను వెల్లడించారు. రెక్టార్ ఆచార్య పి వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య ఆర్ శివరామ్ ప్రసాద్, మంగళగిరి ఎన్నారై వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ఆచార్య శ్యాంసన్ సంజీవరావు ప్రసంగించారు. అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాధిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.